# అప్పట్లో ఇంకా బాగుండేది!

సుప్రసిద్ధ ఐరిష్ రచయిత ఆస్కార్‌వైల్డ్ హాస్య సంభాషణలకు పెట్టింది పేరు. వివిధ సందర్భాల్లో ఆయన చెప్పిన చతురోక్తులు కొన్ని..



అమెరికా అంతర్యుద్ధ ప్రాముఖ్యం వైల్డ్‌కు బాగా తెలుసు. అతడు తన అమెరికా పర్యటనలో బానిసత్వ రద్దుకు వ్యతిరేకంగా నిలిచిన కాన్ఫెడరసీకి పుట్టినిల్లైన చార్ల్స్‌టన్‌ను సందర్శించాడు. భోజనం తర్వాత వెన్నెల రాత్రిని ఆస్వాదించేందుకు ఓడరేవుకు వెళ్లాడు. మరో స్థానికుడు కూడా అతడితో ఉన్నాడు. అతడితో మాట కలపాలని ఆకాశానికేసి చూస్తూ వైల్డ్, 'ఈరాత్రి చంద్రుడు ఎంత అందంగా ఉన్నాడో కదూ?' అన్నాడు.

దానికావ్యక్తి కాస్సేపు మౌనందాల్చి, తర్వాత నిట్టూరుస్తూ 'ఇప్పుడేమి అందం? అంతర్యుద్ధానికి ముందు చంద్రుడిని చూసివుండింటే ఇంకా ఎంత మెచ్చుకునిండేవాడివో' అన్నాడు.

ఎంతోమంది నోర్మూయించిన ఆస్కార్‌వైల్డ్ అంతటివాడే ఆ మాటలకు నిశ్చేష్టుడయ్యాడు.

## రాణికి త్రిశంకు స్థితే గతి

విశృంఖల లైంగికత విషయంలో ఆరోపణలువచ్చి ఆస్కార్‌వైల్డ్ విచారణ ఎదుర్కొన్నాడు. కాని దురదృష్టమేమంటే కోర్టు తీర్పు అతడికి వ్యతిరేకంగా వచ్చింది. రెండేళ్ల కఠిన కారాగార శిక్ష పడింది. తీర్పు వచ్చిన తర్వాత అతడిని చాలాసేపు వేచివుండేలా చేసి, కుండపోతగా కురుస్తున్న వర్షంలో నిలబెట్టి, రెండు



చేతులకూ బేడీలువేసి జైలుకు తరలించారు. ఆ సందర్భంలో అతడు విక్టోరియా రాణినుద్దేశించి, 'రాణి విక్టోరియా ఖైదీలపట్ల ఇలాగే ప్రవర్తిస్తే ఆమెకు చనిపోయిన తర్వాత స్వర్గం, నరకం రెండింటిలో ఏదీ దక్కదు. త్రిశంకు స్థితే ప్రాప్తి' అన్నాడు హాస్యంగా.

# అనేకసార్లు కనుగొన్నారు

అమెరికాలో పర్యటిస్తున్న ఆస్కార్‌వైల్డ్‌ను ఓ అమెరికన్ ఎలాగైనా సరే మాటల్లో పెట్టాలని, 'మీకు తెలుసా? కొలంబస్! ఓహ్.. చాలా అద్భుతమైన మనిషి!' అన్నాడు.

'ఎందుకు? ' అడిగాడు ఆస్కార్‌వైల్డ్.



'ఎందుకేమిటి..? అతడు అమెరికాను కనుగొన్నాడు కదా? '

'ఓహ్.. అది అబద్ధం. అతడికంటే ముందుగానే దాన్ని తరచుగా అనేకమంది కనుగొంటూ వచ్చారు. కానీ ప్రతిసారీ బలవంతంగా వారి నోరు మూయించబడేది' అన్నాడు వైల్డ్.

# సంపాదకుడి విందు

సాటర్ డే రివ్యూ పత్రిక సంపాదకుడు ఫ్రాంక్ హారిస్ హోటల్ రాయల్ కేఫ్‌లో భారీవిందు ఏర్పాటు చేసి లండన్‌లోని గొప్ప హాస్య చతురత కలవారిని ఆహ్వానించాడు. ఎంతోమంది అతిథులు మంచి చతుర సంభాషణలు చెబుతున్నా మొత్తంగా చూస్తే ఆ పార్టీలో ఇతరులపై ఆధిక్యం చూపుతూ ప్రముఖంగా నిలిచాడు ఆతిథ్యమిచ్చిన ఫ్రాంక్.



చివరిగా అతడు, 'లండన్‌లో నేనెంతో మంది ప్రముఖుల ఇళ్లకు ఆహ్వానితుడిగా వెళ్లాను' అని గొప్పగా చెప్పాడు.

దానికి ఆస్కార్‌వైల్డ్ అడ్డుకట్టవేస్తూ, 'ఔను, తమరు భోజనం చేయని ఇల్లంటూ ఈ మహా నగరంలో ఏదీ మిగలలేదు కదూ? ' అన్నాడు ఆటపట్టిస్తూ.

# పల్లెకూ పట్నానికీ తేడా?




ఆధునిక నాగరికత తెచ్చిన పట్నం జీవితంతో విసుగు చెంది, దానికి రియాక్షన్‌గా ప్రకృతిలోకి వెళ్లి జీవించాలనే ధోరణి పారిశ్రామిక విప్లవం వచ్చిన తొలినాళ్లలోనే మేధావులు, కవుల్లో అంకురించింది. దీంతో పల్లెటూరి జీవితాన్ని ఆకాశానికెత్తివేయడం సాధారణమైంది. ఓసారి పల్లెటూరి జీవితం గురించి ఆస్కార్‌వైల్డ్‌ను ఏమని చెబుతారో చూద్దామని అడిగితే ఇలా చెప్పారు: పల్లెటూరిలో స్వచ్ఛమైన కలుషితంకాని గ్రామీణ జీవితం ఉంటుంది. వారు పెందరాళే లేస్తారు. దానికి కారణం చేయడానికి వారికెన్నో పనులు ఉంటాయి. అలాగే రాత్రిళ్లు చాలా త్వరగా పడుకుంటారు.. కారణమేమంటే ఆలోచించేందుకు వారికేమీ విషయం తట్టదు. వాస్తవానికి వారి బుర్రలు దేనిగురించీ ఆలోచించవు. వారికి కడుపుకింత పడితే చాలు కాబట్టి.

## చూపించాల్సింది ఏమీలేదు



ఉపన్యాసాలిచ్చేందుకు అమెరికాకు వెళ్లిన ఆస్కార్‌వైల్డ్‌ను ఓసారి న్యూయార్క్‌లో కస్టమ్స్ ఆఫీసర్స్ క్షుణ్ణంగా తనిఖీచేసి, 'మీరు చూపించాల్సింది, బయటపెట్టాల్సింది ఇంకేమైనా ఉందా? ' అన్నారు.

దానికి ఆయన సుతిమెత్తగా 'నా ప్రజ్ఞాపాటవాలు, తెలివితేటలు తప్ప ఇంకా మీకు చూపించాల్సిందేమీ లేదు' అన్నాడు.

### అమెరికన్లు చనిపోతే..?

ఓసారి అమెరికన్ల గురించి వైల్డ్‌ను అడిగితే హాస్యంగా ఆయన ఇలా అన్నాడు. 'మంచి అమెరికన్లయితే చనిపోయిన తర్వాత పారిస్‌కు వెళతారు. చెడ్డ అమెరికన్లయితే చనిపోయాక కూడా మళ్లీ నరకంలాంటి అమెరికాకే పోతారు'